క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో కోతలు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెం మెట్ట మీద ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లో పనులు నిర్వహిస్తున్నందున, సబ్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు, సుబ్బారెడ్డి కాలనీ, రాజుల కాలనీ, జేపీ సెంటర్, అశ్వారావుపేట రోడ్డు, సాలిపేట, శేషాద్రి నగర్, శ్రీనివాసపురం రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జంగారెడ్డిగూడెం: మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే గురువారం అర్బన్ మార్కెట్‌ను నిర్వహించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన సుమారు 35 యూనిట్ల ఉత్పత్తులను విక్రయించారు. అర్బన్‌మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పరిశీలించారు. ఈ మార్కెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ పి.భవానిప్రసాద్, వైస్‌చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవి రత్నం, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు సీహెచ్ అచ్యుతరామయ్య, కౌన్సిలర్‌లు, మెప్మా టీఎంసీ పాల్గొన్నారు.

త్వరలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 12 అడుగుల భారీ విగ్రహాన్ని సరిపల్లిలో త్వరలో ఆవిష్కరించనున్నట్లు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. సరిపల్లి గ్రామ సచివాలయం వద్ద ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని క్రేన్ ద్వారా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షతన త్వరలో నిర్వహించబోయే సామాజిక సాధికారత బస్సు యాత్రలో విగ్రహావిష్కరణ చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.


సరిపల్లిలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు

మద్యం విక్రేతపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పీవీఆర్ ఆసుపత్రి ఎదురుగా టీస్టాల్‌లో మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో గురువారం ఏఎస్సై వై.మంగయ్య, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో టీస్టాల్ నిర్వాహకుడు సుంకర పోసిబాబు వద్ద అనధికారికంగా మద్యం బాటిల్ కలిగినట్లు గుర్తించామని ఏఎస్సై మంగయ్య తెలిపారు. అతని వద్ద నుంచి మొత్తం 33 వివిధ రకాల బ్రాండ్‌ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. 5960 ఉంటుందన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

టి.నరసాపురం: కేబుల్ వైరు చోరీ చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 25వ తేదీన వల్లంపట్ల గ్రామ శివారులో మరీదు సత్యనారాయణకు చెందిన వ్యవసాయ భూమిలో వ్యవసాయ బోరుకు సంబంధించిన మోటారు పంపు, కేబుల్ వైరు చోరీకి గురైంది. బొర్రంపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ చెప్పారు.

మహిళలపై హింసను అరికట్టాలి

జంగారెడ్డిగూడెం రూరల్: మహిళలపై హింసను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సచివాలయాల శాఖ ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్ అన్నారు. మహిళలపై హింస వ్యతిరేక ఉద్యమంలో భాగంగా గురువారం లక్కవరం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్నేహన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరిగిన సీడా ఒప్పందం మేరకు మహిళల హింస నిరోధించాలనే డిమాండ్ పెరిగిందన్నారు. మహిళలపై జరిగే హింసను రెండు రకాలుగా వర్గీకరించారని వాటిలో గృహ హింస, బహిరంగ హింస గురించి ఆయన వివరించారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాయిబాలాజీ టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్న శింగలదేవి బాలకృష్ణ జంగారెడ్డిగూడెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 28వ తేదీ తన మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలకృష్ణ, ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెరువులను కేటాయించాలి

జంగారెడ్డిగూడెం: రజకులకు వృత్తిని చేసుకునేందుకు చెరువులను కేటాయించాలని జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. చింతలపూడి నియోజకవర్గం పర్యటనలో భాగంగా గురువారం జంగారెడ్డిగూడెంలో జిల్లా రజక నేతలు పర్యటించారు. గ్రామాల రజకులను వృత్తిపరమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో రజకులు తమ చెరువులను వృత్తి చేసుకొనుటకు అనుకూలంగా ఉండేటట్లు చెరువులను తవ్వించాలని, రజకుల చెరువు వద్ద బోరు, విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

సాగుదారులకు సంపూర్ణ హక్కులు

ద్వారకాతిరుమల: అసైన్డ్ భూములపై సాగుదారులకు సంపూర్ణ హక్కులు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అసైన్‌మెంట్, డినమూనా, చుక్కల భూములు కలిగిన లబ్ధిదారులకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ మండలంలో 1,888 ఎకరాలకు గాను, 1,238 మంది రైతులకు హక్కు పత్రాలను మంజూరు చేసినట్టు చెప్పారు. తొలి విడతగా పలువురికి ఆ పత్రాలను అందించామని, మిగిలిన వారికి రెండో విడతలో అందిస్తామని తెలిపారు. సంపూర్ణ భూ హక్కు ద్వారా రైతన్నలకు జరిగిన మేలు చారిత్రాత్మకమన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న పాలన స్వర్ణయుగమని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, స్థానిక సర్పంచ్ కుంటం స్వర్ణలత, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, దాసరి ఏసురత్నం, చెరుకూరి ప్రసాదరావు, గోపా నాగేశ్వరరావు, షేక్ భాషా, కొండాబత్తుల గిరి, మానుకొండ సుబ్బారావు, బండారు ధనలక్ష్మి, చెలికాని బుల్లియ్య, ఆకుర్తి సత్యన్నారాయణ, తహసీల్దార్ పి.సతీష్ తదితరులున్నారు.


ద్వారకాతిరుమల: తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


బుట్టాయగూడెం: అసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, ఐటీడీఏ పీఓ సూర్యతేజ

అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

బుట్టాయగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ చేతుల మీదుగా అర్హులైన వారికి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అసైన్డ్ భూములకు సర్వ హక్కులు కల్పించి పేద రైతులకు మేలు జరిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ అద్దయ్య, తహసీల్దార్ ఎస్.శారాకాంతి, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

చింతలపూడి: ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే ఎలీజా పిలుపునిచ్చారు. చింతలపూడి లయన్స్‌క్లబ్‌లో గురువారం నియోజకవర్గ పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ శాంతితో కూడుకున్న క్రీస్తు మార్గం ఆచరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, దయ, కరుణను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కృష్ణా, గోదావరి జిల్లాల సీఎస్ఐ పీఠాధిపతి బిషప్ తంటెపూడి కొర్నేలియస్, ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరాజు, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల జోసెఫ్, ఇమ్మానియేలు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన బత్తిన లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులు సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. పలువురు సభ్యులు తమ వార్డుల్లో పనులు పెట్టడం లేదని పేర్కొన్నారు. తమ వార్డుల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. దీంతో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తనకు తెలియజేయాలని వెంటనే ఆ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, 19వ వార్డు కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని తమ వార్డుల్లో బోర్లు వేసి వదిలేశారని, ఆ బోర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే వాటిని పూడ్చివేయాలని కోరారు. తాను నాలుగైదు సమావేశాల నుంచి కోరుతున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పామాయిల్ కర్మాగారం నుంచి రసాయన వ్యర్థ జలాల కారణంగా తమ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని అన్నారు. గడపగడపకు కార్యక్రమానికి కూడా తనకు సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన సావిత్రిభాయి పూలే విగ్రహాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఉంచారని, ప్రస్తుతం అది కనబడటం లేదని, వెంటనే ఆ విగ్రహాన్ని గుర్తించి పునరుద్ధరించాలని ఆమె కోరారు. అలాగే పలువురు సభ్యులు తమ వార్డులో డ్రెయిన్‌లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా రూ.4.49 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, కల్వర్టులు నిర్మాణం చేపట్టేందుకు సమావేశం తీర్మానించింది. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కమిషనర్ పి.భవానీప్రసాద్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

కౌన్సిల్‌లో ఆమోదించిన తీర్మానాలివే..

- రూ.319.65 లక్షలతో పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.
- 6, 7, 9 వార్డుల్లో కల్వర్టుల నిర్మానానికి రూ.17.05 లక్షలు వెచ్చించేందుకు తీర్మానం.
- రూ.19.75 లక్షలతో 6, 7, 22 వార్డుల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం.
- పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి బుట్టాయగూడెం రోడ్డులోని గాంధీ బొమ్మ సెంటర్ వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లకు ఆమోదం
- స్థానిక సాయిబాలాజీ టౌన్ షిప్‌లో పార్కును అభివృద్ధి చేసేందుకు రూ.40 లక్షలు వెచ్చించేందుకు తీర్మానం
- మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంటర్ లాకింగ్ టైల్స్‌తో ఫ్లోరింగ్ నిర్మాణానికి, కెర్బ్ వాల్ నిర్మాణానికి సుందరీకరణకు రూ. 35 లక్షలు ఖర్చుచేసేందుకు ఆమోదం.
- 22వ వార్డులో రూ.5 లక్షలతో హెచ్‌డీపీఈ పైప్‌లైన్ ఏర్పాటు
- రూ.12 లక్షలతో స్థానిక 27వ వార్డులో ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న రోడ్డు ప్రారంభం నుంచి గవర్నమెంట్ ఆఫీసర్స్ భవనం వరకు క్వారీ రబ్బిష్ రోడ్డు నిర్మాణం.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బుట్టాయగూడెం: రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం బాలరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులు రైతుభరోసా కేంద్రాల్లో అమ్ముకునే విధంగా అవకాశం కల్పించారని తెలిపారు.

జాబ్‌మేళా విజయవంతం

నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా కార్యక్రమంలో 456 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 171 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా 26 మంది ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సుమారు 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని సుమారు 1000 మందికి ఉద్యోగాలు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, జేడీఎమ్ డీఆర్‌డీఏ పార్థసారథి, జిల్లా ఉపాధి కార్యాలయ ప్రతినిధి రవి, ఏడీఎస్ డీఓ కిశోర్, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రవీణ్, హెచ్‌ఎమ్ గంగాదేవి, ఏవో బి.సుమలత, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జాబ్‌మేళా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, పీఓ సూర్యతేజ

ఎంఎస్ఎంఈ మొబైల్ యాప్‌పై శిక్షణ

జంగారెడ్డిగూడెం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ ట్రాకింగ్ సర్వే మొబైల్ యాప్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ స్థాయిలోని పంచాయతీ కార్యదర్శులు, వార్డు సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, గృహ నిర్మాణ శాఖ పీడీ రవికుమార్ శిక్షణ అందించారు. ఆదిశేషు మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న అన్ని రకాల పరిశ్రమలను గుర్తించి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు, పరిశ్రమలో పనిచేసే కార్మికుల నైపుణ్యతను పెంచేందుకు, ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం, లబ్ధి అందించేందుకు ఈ సర్వే చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో డిసెంబర్ 10 నుంచి 20 వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్లు లేని పరిశ్రమలను గుర్తించడం జరుగుందని జీఎం ఆదిశేషు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పథకాలకు అర్హుల వివరాలను నమోదుచేసి వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు

రంగాపురంలో సత్యదేవుని వ్రతాలు

లింగపాలెం: రంగాపురంలోని శ్రీసత్యన్నారాయణ స్వామి ఆలయంలో గురువారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు శ్రీసత్యన్నారాయణ స్వామి వ్రతాలు జరుపుకున్నారు. ఇక్కడకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచే కాకుండా కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయానికి వచ్చి వ్రతాలు జరుపుకున్నారు. ద్వారకాతిరుమల ఈవో వి త్రినాథరావు, ఏఈఓ నటరాజు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన గుమస్తా శేట్టిపల్లి గోపి పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు శేషాచార్యులు భక్తులచే వ్రతాలు చేయించారు.

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎంఎన్ఎం ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు డీసీహెచ్ఎస్ బి.పాల్ సతీష్ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, వసతులు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం డీసీహెచ్ఎస్ బి.పాల్ సతీష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్స్‌రేకు సంబంధించి టెక్నీషియన్ పోస్టు భర్తీ కాలేదని, డిప్యూటేషన్‌పై నియమించిన టెక్నీషియన్‌తోనే సేవలు అందించనున్నట్లు చెప్పారు. కాగా ఎక్స్‌రే సేవలు ఆలస్యంపై వస్తున్న ఫిర్యాదులపై పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ఎక్స్‌రే సేవలకు సంబంధించి కృష్ణ డయోగ్నొస్టిక్స్‌తో ఎంఓయూ ఉందని, వారు రిపోర్టులు అదే రోజు త్వరగా ఇచ్చేలా ఆదేశిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వజ్రకిరణ్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యుల నుంచి ఆసుపత్రి విషయాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ బి.పాల్ సతీష్

జీవ శాస్త్రాలలో కొత్త పోకడలపై సదస్సు

జంగారెడ్డిగూడెం: జీవ శాస్త్రాలలో వస్తున్న ఆధునిక పోకడలకు అనుగుణంగా విద్యలో రాణించేందుకు విద్యార్థులు కృషిచేయాలని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో జీవ శాస్త్రాలలో కొత్త పోకడలపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.శ్రీధర్, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.సుజాత మాట్లాడుతూ బయో డైవర్సిటీ గురించి, ఆక్వా కల్చర్, చేపల పెంపకంలో సుస్థిర అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం బయోలాజికల్ సైన్స్‌కు సంబంధించిన 23 పేపర్లతో ప్రచురితమైన జర్నల్‌ని ఆవిష్కరించారు.

జగన్ పాలనలో అట్టడుగు వర్గాలకు న్యాయం

చింతలపూడి: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే న్యాయం చేకూరిందని ఎంపీపీ డా.బి.రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని నామవరం సచివాలయంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా బడుగు, బలహీన వర్గాలకు అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ విశేషంగా కృషి చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలబడి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ప్రారంభించారు. అనంతరం పట్టాయగూడెంలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. సర్పంచ్ జె వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ మురళీకృష్ణ, గృహనిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లేను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఆవిష్కరించారు. బాబ్జి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు, జి.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: ఇటికలకోట గ్రామ పంచాయతీ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాలను తెలిపే బోర్డును ఆవిష్కరించి గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయిరామ్, సర్పంచ్ సున్నం గంగాదేవి, ఎంపీడీవో జి.శ్రీను, కో–ఆప్షన్ సభ్యులు షేక్ ఖాన్, నాయకులు సున్నం గంగాజలం , కుంజం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి ఓటుతో మద్దతు తెలుపుదాం

లింగపాలెం సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి వచ్చే ఎన్నికలలో ఓటు ద్వారా ప్రజలు మద్దతు తెలపాలని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. లింగపాలెం గ్రామంలో గురువారం సర్పంచ్ తగరం హేమలత ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ భీమిరెడ్డి స్వరూప, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భీమిరెడ్డి సోమిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఉప సర్పంచ్ సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి, పార్టీ నాయకులు బి.ప్రభాకరెడ్డి, రాంబాబు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

టి.నరసాపురం: రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు అన్నారు. మండలంలోని తెడ్లం గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెడ్లం గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్టీ స్థూపాన్ని జెండాను శ్రీనురాజు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగనన్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామాల స్వరూపాలనే మార్చివేశారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండి సుబ్బారావు, ఉమ్మడి తేజ, పంచాయతీ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

ద్వారకాతిరుమల: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో పాల్గొన్న వాసు నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న నాలుగున్నరేళ్ల పాలనకు, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సాగించిన పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాత్రి పార్టీ నాయకులతో కలసి ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మార్గాని చిట్టియ్య, బోరుగడ్డ రాజారావు, మానుకొండ సుబ్బారావు, దాసరి రాంబాబు, కొండాబత్తుల గిరి, కొడుదుల ప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులున్నారు.


చింతలపూడి: నామవరంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరించిన జెడ్పీటీసీ బాబ్జి


పోలవరం రూరల్: ఇటికలకోటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


లింగపాలెం: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు